## క్లుప్తంగా

### ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ రాజశేఖర్

**బేతంచెర్ల:** నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ రాజశేఖర్ సూచించారు. గురువారం మండల పరిధిలోని యంబాయి, శంకలాపురం, మద్రికుంట, కొలుములపల్లె, బలపాల పల్లె గ్రామాల్లో సొంత స్థలాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

### నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే

**కోవెలకుంట్ల:** స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు.ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఓపెన్‌డే సందర్భంగా కోవెలకుంట్ల పరిసర ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు డిగ్రీ కళాశాలను సందర్శించవచ్చన్నారు. కళాశాలలోని మౌలిక సదుపాయాలు, వసతులు, వనరులు, వివిధ విభాగాలను పరిశీలించవచ్చని పేర్కొన్నారు.కళాశాల అధ్యాపకులతో మాట్లాడి ఉన్నత విద్య అవకాశాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఓపెన్ డేను పురస్కరించుకుని కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్,అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


### 19న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**బేతంచెర్ల:** మండల పరిధిలోని యంబాయి గ్రామ సమీపాన వెలసిన శ్రీపార్వతీ సమేత భోగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 19న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విజేతలకు మొదటి, రెండవ, మూడవ, నాల్గవ బహుమతులు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, తృతీయ రూ 6 వేలు, రూ.4 వేల చొప్పున అందజేస్తామన్నారు.

### 18న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

**డోన్ రూరల్ :** మండల పరిధిలోని దేవరబండలో ఈనె18న శ్రీ దేవరబండ తిమ్మగురుడు స్వామి, మహాశివరాత్రి పండుగ సందర్భంగా సర్పంచ్ పద్మావతమ్మ, ఎంపీటీసీ మహేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సర్వోత్తంరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో గ్రామ పెద్దలు తెలిపారు. గెలుపొందిన వృషభాల యాజమాన్యాలకు వరసగా రూ. 40వేలు, రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేత జట్లకు వరుసగా రూ. 20వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3వేలు చొప్పున అందజేస్తామని చెప్పారు. అదేవిధంగా 20వ తేదీన సేద్యం ఎద్దులకు మాత్రమే గిరకబండి పోటీలు నిర్వహిస్తామని, విజేత ఎద్దుల యాజమాన్యాలకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3వేలు చొప్పున అందజేస్తామని గ్రామపెద్దలు వివరించారు.

### గడ్డి వాముల దగ్ధం



కాలిబూడిదైన గడ్డివాములు

**డోన్ రూరల్:** మండల పరిధిలోని యాపదిన్నె గ్రామానికి చెందిన రైతులు తరంగ మాదన్న, ప్రభాకర్, రామాంజినేయులు, మారెప్పకు చెందిన గడ్డి వాములు గురువారం దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గడ్డివాములు బూడిదయ్యాయని స్థానికులు ఆరోపించారు. ఒక్క సారిగా మంటలు ఎగిసి పడడంతో సమీప పొలాల్లోని రైతులు గమనించి నీటితో మంటల అదుపునకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. స్థానికుల సమాచారం మేరకు వెంటనే వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**ప్యాపిలి:** మండల పరిధిలోని గొల్లపల్లి బుగ్గ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాధవరం గ్రామానికి చెందిన మధుశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గొల్లపల్లిబుగ్గ నుంచి మాధవరం గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తు లారీ వెనుక చక్రం తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# మెట్ట భూములకు జలకళ !

- పైసా ఖర్చు లేకుండా ఉచితంగా బోర్లు
- మోటార్, విద్యుత్ సౌకర్యం కూడా
- జిల్లాలో ఇప్పటికే 1,545 బోర్ల ఏర్పాటుకు రూ.14.92 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ఉమ్మాయిపల్లె వద్ద బోరు వేస్తున్న దృశ్యం

**కొలిమిగుండ్ల:** మెట్ట భూములకు జలకళ సంతరించుకుంటుంది. వర్షాధార భూముల్లో సిరులు పండే సమయం ఆసన్నమైంది. ఇక సాగు పండుగ కానుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ జలకళ పథకం సన్న, చిన్న కారు రైతులకు వరంగా మారింది. పాదయాత్ర సమయంలో అడుగడుగునా రైతుల సాగునీటి కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నేను విన్నాను...నేను ఉన్నాను' అంటూ ఇచ్చిన హామీ మేరకు సీఎం అయ్యాక రైతులకు అండగా నిలుస్తున్నారు. వ్యవసాయానికి జీవం పోశారు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తూ రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ప్రత్యేకించి మెట్ట భూముల్లో సైతం అన్నదాత బంగారు పంటలు పండించాలనే ఉద్దేశంతో వైఎస్ఆర్ జలకళ పథకం అమలు చేపట్టారు. రైతులకు ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచితంగా బోర్లు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బోర్లు ఏర్పాటుతో రైతుల జీవితాల్లో పెను మార్పు లు చోటు చేసుకుంటాయనే భావనతో ప్రభుత్వం బృహత్కర పథకం అమలు చేస్తోంది. సాగు కష్టాలు తీరుతుండడంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పుష్కలంగా భూగర్భ జలాలు**

జలకళ పథకం కింద ఏర్పాటు చేస్తున్న బోర్లలో గంగమ్మ ఉబికి వస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రకృతి సహకరించడంతో సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. తక్కువ లోతులోనే నీరు పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా బోర్లు తవ్వించుకునేందుకు 17 వేల దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు 3,100 మంది రైతుల దరఖాస్తులు పరిశీలించిన అధికారులు హైడ్రోలాజికల్, జియోఫిజికల్ సర్వే చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,545 బోర్ల ఏర్పాటుకు రూ.14.92 కోట్ల ఖర్చు చేసినట్లు రికార్డుల సమాచారం. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క రైతుకు బోరు వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పథకం అమలు ప్రారంభంలో వివిధ కారణాల మూలంగా కొంతమేర జాప్యం జరిగినప్పటికీ ప్రస్తుతం ఊపందుకుంది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే జిల్లా వ్యాప్తంగా 300 బోర్లు వేసినట్లు డ్వామా అధికారుల సమాచారం. ప్రత్యేకించి కొలిమిగుండ్ల మండలంలోని చింతలాయిపల్లె పంచాయితీలో అత్యధికంగా 68 మేర బోర్లు వేశారు. అదేవిధంగా ఉమ్మాయి పల్లెలో పంచాయతీలో 27 బోర్లు వేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు బుధవార రాత్రి నుంచి బోరు ఏర్పాటు పనులు ప్రారంభం కాగా మూడు పూర్తయ్యాయి. రెండు ఇంచులు మొదలు కొని నాలుగు ఇంచుల మేర నీళ్లు పడటంతో రైతుల సంతోషానికి అవధుల్లేవు.

**ఆర్థిక భారం పడకుండా...**

వైఎస్సార్ జలకళ పథకం కోసం అర్హులైన రైతులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐదు ఎకరాల్లోపు సన్న, చిన్నకారు మెట్ట రైతులకు ఏ మాత్రం ఆర్థిక భారం కాకుండా బోరు వేస్తున్నారు అధికారులు. దరఖాస్తు చేసుకున్న రైతుల మెట్ట భూముల్లో ప్రాధాన్యత క్రమంలో బోర్లు వేస్తున్నారు. సాధారణంగా రైతు బోరుతో పాటు విద్యుత్ కనెక్షన్ తదితర వాటి కోసం రూ.3లక్షలకు పైగానే వ్యయం చేయాల్సి వస్తుంది. వైఎస్ఆర్ జలకళ పథకం ద్వారా రైతుకు ఒక్క పైసా ఖర్చు లేకుండా కేసింగ్ పైపులతో సహా బోర్ల నిర్మాణం చేపడుతుంది ప్రభుత్వం. అదేవిధంగా విద్యుత్ స్తంభాలు, వైర్ తదితర సామగ్రితో పాటు మోటార్ సైతం ప్రభుత్వమే పూర్తిగా ఉచితంగా అందిస్తుంది కూడా.

### నీళ్లు బాగా పడ్డాయి



నాకు మూడు ఎకరాల మెట్ట ఉంది. సాధారణంగా వర్షాధారం కింద పంటలు పండించేవాడిని. ప్రభుత్వం జలకళ పథకం ప్రవేశపెట్టడంతో దరఖాస్తు చేసుకోగానే అధికారులు సర్వే చేసి బోరు వేశారు. వంద అడుగుల లోపే నీళ్లు పుష్కలంగా పడ్డాయి. విద్యుత్ కనెక్షన్ వచ్చింది. మోటార్ మంజూరు చేయాల్సి ఉంది. నీటిసౌకర్యం రాకతో వివిధ రకాల పండించుకోవచ్చు.

– ప్రసాద్,చింతలాయిపల్లె

### ఇచ్చిన హామీ నెరవేర్చారు



పాతయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం వైఎస్ జగన్ రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తు మాట నిలబెట్టుకున్నారు. ఐదు ఎకరాల్లో బోరు నిర్మాణం జరిగింది. మెట్ట రైతులకు వ్యవసాయ బోరు ఉంటే ఎంతో మేలు. వ్యవసాయం ఏ మాత్రం కష్టం కాదు. ఈపథకంతో రైతుల కష్టాలు దాదాపు తీరుతాయి.

– ఓబుల రెడ్డి, ఉమ్మాయిపల్లె

### ప్రతి దరఖాస్తుకు న్యాయం

జలకళ పథకం కింద రైతుల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తుకు న్యాయం చేస్తాం. అర్హులైన ప్రతి రైతుకు ఉచితంగా బోర్లు వేయిస్తాం. ఎవరి సిఫారసు అవసరం లేదు. జిల్లా వ్యాప్తంగా వేస్తున్న బోర్లలో నీళ్లు సమృద్ధిగా పడుతుండడం సంతోషకరమైన విషయం. రైతులకు ఏ మాత్రం ఖర్చు లేకుండా బోరు వేస్తున్నాం. సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం ఓ వరం. సద్వినియోగం చేసుకోవాలి.

– సలీం బాషా, అడిషనల్ పీడీ, డ్వామా

### వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని బలపర్చండి



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ. జెడ్పీటీసీ మాజీ సభ్యులు

**ప్యాపిలి:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని బలపర్చా లని ఎంపీపీ గోకుల్ లక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యు లు దిలీప్ చక్రవర్తి కోరారు. మండల పరిధిలోని బూరుగల, రాచర్ల, జలదుర్గం, మాధవరం తదితర గ్రామాల్లో గురువారం వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సోదరుడు నరేశ్ రెడ్డి, సోషల్ మీడియా కోకన్వీనర్‌లు జాకీర్, ప్రేమసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్యాపిలి:** గుత్తి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ప్యాపిలి, పోతుదొడ్డి, పెద్దపొదిళ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామాలకు సంబంధించి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని ఓబులరెడ్డి

**కోవెలకుంట్ల:** రాష్ట్ర ప్రభుత్వం నవరత్న పథకాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కన్వీనర్లు, గృహసారథులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి సూచించారు. గురువారం సంజామల మండలం పేరుసోముల గ్రామంలో మండల ఉపాధ్యక్షుడు చిన్నబాబు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, గృహసారథుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం 32 రకాల సంక్షేమ పథకాలను వర్తింపచేస్తోందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పరిపాలనను గ్రామ స్థాయిలో వికేంద్రీకరణచేసి నవరత్నాల ద్వారా ప్రజల ఇంటిముంగిటకే సంక్షేమ పథకాలను తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ అందనం శృతి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, గౌడ్, నబీరసూల్, కృష్ణబాబు, నాగరాజు, అబ్దుల్ రఫీ, రామయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

## ఓపెన్ డేకు విశేష స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్

**డోన్ టౌన్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఓపెన్ డే కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలతోపాటు ప్యాపిలి, బేతంచెర్ల మండలాల నుంచి ఇంటర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సుల వివరాలు, ల్యాబ్ సౌకర్యాలపై విద్యార్థుల తోపాటు తల్లిదండ్రులకు ప్రిన్స్‌పాల్ భారతి, అధ్యాపకులు అవగాహన కల్పించారు. డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీటు పొంది భవిష్యత్తుకు మార్గం చూసుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు.

## ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

**బనగానపల్లెరూరల్:** విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. శుక్రవారం సాయంత్రం బనగానపల్లెలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మెడికల్ ఆఫీసర్ సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యాయామం, ధ్యానం, యోగా అలవర్చుకోవాలన్నారు. భోజనానికి ముందు తరువాత చేతుల పరిశుభ్రతను పాటించాలని, తగిన విశ్రాంతి తీసుకుంటూ చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వర్లు,ఏఎన్ఎం,ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# భూ పంపిణీకి అడ్డుతగలడం తగదు

- పేదలకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లడం సమంజసం కాదు
- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తీరుపై మండిపడిన నాయకులు
- 20న నిరసన ర్యాలీ



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**కొలిమిగుండ్ల:** బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలకు ప్రభుత్వ బంజరు భూమి పంపిణీ చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డి అడ్డుకునే ప్రయత్నం ఏ మాత్రం తగదని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు హెచ్చరించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేదలకు భూ పంపిణీ చేసేందుకు చర్యలు చేపడితే మాజీ ఎమ్మెల్యే అడ్డుతగులుతూ కోర్టును ఆశ్రయించడం ఎంతవరకు న్యాయమని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే బీసీ తీరును తప్పుపడుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ఎస్సీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని పేదలకు భూ పంపిణీ చేసయాలనే సదుద్దేశంతో ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీవో తీసుకొచ్చారని, అయితే మైనింగ్ భూమి అంటూ... భూ పంపిణీ ఎలా చేస్తారంటూ అడ్డుకునేందుకు మాజీ ఎమ్మెల్యే బీసీ హైకోర్టును ఆశ్రయించడం సిగ్గుచేటన్నారు. గత టీడీపీ ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్యేగా ఉన్న బీసీ ఏ ఒక్క పేదకైనా భూమి ఇప్పించారా అని ప్రశ్నించారు. పేదలకు వ్యతిరేకంగా భూ పంపిణీకి అడ్డుతగిలే ప్రయత్నం మానుకోవాలని, లేని పక్షంలో ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పేదల కడుపు కొడితే రాజకీయంగా పుట్టగతులుండవన్నారు. కబ్జాలు చేసి భూమి లాక్కోవడం లేదని జీవనోపాధి కోసం కష్టపడి దాచుకున్న సొమ్ముతో బంజర భూమిని బాగు చేసుకుంటున్నారని తెలిపారు.

**20 భారీ ర్యాలీ, ధర్నా**

పేదలకు చేయనున్న భూ పంపిణీని అడ్డుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తీరను నిరసిస్తూ ఈ నెల సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపడుతున్నామని ఎస్సీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కా ర్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. పేదలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బెలుం బాషా, కంబగిరిస్వామి, నాగయ్య, ఈశ్వరయ్య, రాయప్ప, పాములేటి, సోమయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణ దేవరాయల చిత్ర పటానికి పూలమాల వేస్తున్న బలిజ సంఘం నాయకులు

**బేతంచెర్ల:** పట్టణంలోని పాతబస్టాండు సమీపాన శ్రీకృష్ణదేవరాయల 552 జయంతిని గురువారం బలిజ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు అని మండల బలిజ సంఘం నాయకులు కృష్ణుడు, సుబ్బారెడ్డి, గాజుల హరి తెలిపారు. విజయనగర సామ్రాజ్య అధినేతగా కృష్ణదేవరాలయల పాలన స్వర్ణయుగమని, కవులు, కళలను పోషించారని గుర్తు చేశారు. శ్రీకృష్ణదేవరాలు పాలన గొప్పతనాన్ని, ప్రజలకు చేసిన సేవలను వారు వివరించారు.

### 23న వాహన వేలం

**నంద్యాల(అర్బన్):** స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన వ్యాన్‌ను స్క్రాప్‌గా వేలం వేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఏడీక్యూ 5889 నంబరు గల వ్యాన్ వేలంను ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నామని, పాల్గొనే వారు కళాశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్: 9912342021 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని తుమ్మలపెంట సమీపంలోని జగనన్న కాలనీకి అధికారులు గురువారం విద్యుత్ సౌకర్యం కల్పించారు. లేఅవుట్‌లోని ఐదు వీధులకు 42 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి 25 కేవీ సామర్థ్యం ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. రెండు గృహ నిర్మాణాలు పూర్తి కావడంతో ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. కాలనీలో మొత్తం 90 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. లబ్ధిదారులకు విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించారు. మండలంలో తుమ్మలపెంట లేఅవుట్‌లో మొదటి సారిగా విద్యుత్ సరఫరాను పూర్తి స్థాయిలో కల్పించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోట మల్లేశ్వరరెడ్డి, మల్లిఖారుసరెడ్డి, శివశంకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి యాగంటిలో బ్రహ్మోత్సవాలు

– ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు



యాగంటి ఆలయ గర్భగుడి ఆవరణంలో ఏర్పాటు చేసిన టెంట్లు



భక్తులకు చలువ పందిర్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్

**బనగానపల్లెరూరల్:** శైవ క్షేత్రాల్లో ప్రసిద్ధిగాంచిన మండలంలోని యాగంటి క్షేత్రం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. శుక్రవారం ఉదయం గంటలకు శ్రీ ఉమామహేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్ర నామావళి, 8 గంటలకు ధ్వజారోహణతో ఉత్సవాలను ప్రారంభం కానున్నా యి. ఐదురోజులపాటు జరిగే ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాటు పూర్తి చేశారు ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు. స్వామివారి దర్శనార్థం ఆలయ గర్భగుడి వరకు ప్రత్యే క క్యూలైన్‌ను చలువ పందిర్లతో ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆలయం ప్రధాన ధ్వజ స్తంభం, ఆలయ ప్రాంగణాల్లోనూ టెంట్లు ఏర్పాటు చేశారు. బనగానపల్లె ఆర్టీసీ డిపో నుంచి యాగంటి క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీస్‌లు నడుపుతున్నారు.

**19న శివపార్వతుల కల్యాణోత్సవం**

**డోన్ టౌన్:** పట్టణంలోని పాతపేటలోని పోచా గార్డెన్స్‌లో వెలసిన పురాతన శైవ క్షేత్రమైన శ్రీనగరేశ్వరస్వామి దేవాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త డాక్టర్ పోచా ప్రభాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేది శనివారం శని త్రయోదశి, మాస శివరాత్రి, మహా శివరాత్రి పురస్కరించుకొని ఉదయం 5 గంటల నుంచి అభిషేకాలు, అర్చనలు, ఆదివారం తెల్లవారు జామున 19వ తేదీన 4గంటల నుంచి శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఆశీర్వాదాలు పొందాలన్నారు.

## రామలింగేశ్వర ఆలయం ముస్తాబు



ముస్తాబైన కొత్తబుగ్గ రామలింగేశ్వర దేవాలయం

**డోన్ :** మహాశివరాత్రి ఉత్సవాలకు రామలింగేశ్వర ఆలయం ముస్తాబైంది. స్థానిక కొత్తబుగ్గ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త, మున్సిపల్ వైఎస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ తెలిపారు. ఈ తిరునాల మహోత్సవానికి వేలాది మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్నివిధాల మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.

**బండలాగుడు పోటీలు**

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా 22వ తేదీన స్థానిక రామచంద్ర మాలిక్‌బాబా సంస్థాన్ 33వ ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థాన్ కమిటీ అధ్యక్షుడు ఉల్లిగడ్డల ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సీనియర్ ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విజేత వృషభరాజముల యజమానులకు ప్రథమ బహుమతి కింద రూ.50వేలను డెబ్బె లక్ష్మన్న, ద్వితీయ బహుమతి రూ. 40వేలను పోస్టుపసాద్, ఆర్ఈ రాజవర్దన్‌లు, తృతీయ బహుమతి రూ.25వేలు కమలాపురం కల్లూరి రమేష్, నాల్గవ బహుమతి రూ.20వేలను కున్నూరు కుమార్ అందజేస్తారన్నారు.